
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 9 అక్టోబరు 2025



పేద విద్యార్థులకు ప్రోత్సాహం

- 'ఎన్‌ఎంఎంఎస్' ద్వారా ఏడాదికి రూ.12వేలు మంజూరు
- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- 9 నుంచి ఇంటర్ వరకు అందనున్న కేంద్ర సాయం
- ఈనెల 14 వరకు దరఖాస్తుకు గడువు
- నవంబరు 23న ప్రతిభ పరీక్ష

7లో..

మందకొడిగా టెండర్లు

- మద్యం షాపుల దరఖాస్తు ఫీజు పెంపుతో వ్యాపారుల డైలమా

8లో..

సాదా బైనామా దరఖాస్తులపై విచారణ

కథలాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సాదాబైనామా దరఖాస్తులపై విచారణ జరుపుతున్నామని తహసీల్దార్ వినోద్ తెలిపారు. 2020లో ఆన్‌లైన్‌లో సాదాబైనామాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు గ్రామాల వారీగా ప్రకటించామన్నారు. సుమారు రెండు వేల పైచిలుకు దరఖాస్తులు ఉండగా అమ్మిన, కొనుగోలు చేసిన వారికి నోటీసులు ఇస్తూ విచారణ చేపట్టి పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోందని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ కామర్స్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంకామ్, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు శుక్రవారం తమ సర్టిఫికెట్లతో డెమోకు హాజరు కావాలని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాయికల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామ నాయకుడు నూతిపెల్లి భీమరాజం ఇటీవల మరణించగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట రవీందర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ రాజరెడ్డి, భాస్కర్ రావు, వినోద్ రావు, సురేందర్ రెడ్డి, ఎల్.రాజన్న, జీవన్ రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాలరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జగిత్యాల పట్టణంలో నిర్వహించిన సైన్స్ డ్రామాలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా విద్యార్థులను కల్లెడ ప్యాక్స్ చైర్మన్ జోగినిపెల్లి సందీప్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, ఉపాధ్యాయులు చిక్కుల రమేష్, గంగారెడ్డి, శ్రీకళ, రాధలక్ష్మీ, స్వర్ణలత, కల్పన, లావణ్య, తదితరులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి బుధవారం పూడూర్ గ్రామానికి చెందిన పలువురు దాతలు విరాళాలను అందించారు. పూడూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ మోతె మల్లారెడ్డి 25,116 రూపాయలు, బేతెల్లి శ్రీరాంరెడ్డి, బేతెల్లి రిహాన్‌రెడ్డి 25,116 రూపాయలు, మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన పండుగ తిరుపతి 5,116 రూపాయలను విరాళంగా అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీలో పోషణ మాసం

రాయికల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాస వేడుకలను నిర్వహించారు. ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మంచినీళ్ల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డకు తల్లి పాలు పట్టిన ప్రతిసారి చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పరిశుభ్రమైన ప్రదేశంలో కూర్చొని తల్లి ప్రశాంతంగా బిడ్డకు పాలు పట్టాలని తెలుపుతూ పోషణ మాసం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు విజయలక్ష్మీ, ఫాతిమా, ఆశ వర్కర్ జమున, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, ఆయమ్మ విజయ పాల్గొన్నారు.



నేడు స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్?

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ బి.సత్యప్రసాద్



మొదటి విడత జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రిటర్నింగ్ అధికారులకు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన భద్రత ఏర్పాట్లు చేశాం. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాం.

- తొలి విడతలో 10 జడ్పీటీసీ, 108 ఎంపీటీసీ స్థానాలు
- మొత్తం ఓటర్లు 2,97,763...
- 554 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరినప్పటికీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో ఎన్నికల ప్రక్రియను యథావిధిగా కొనసాగించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. మొదటి విడత ఎన్నికలను నిర్వహించడానికి ఈనెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులను వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించింది. జిల్లాలో మొదటి విడతలో 10 జడ్పీ టీసీ స్థానాలు, 108 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆయా మండలాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులను నియామకం చేశారు. ప్రస్తుతం మండలాల్లో ప్రత్యేకాధికారులుగా ఉన్న వారే దాదాపుగా రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆయా మండల కేంద్రాల్లోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నామినేషన్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు, నాలుగు ఎంపీటీసీ స్థానాలకు ఒక క్లస్టర్ అధికారిని, జడ్పీటీసీ స్థానానికి సంబంధించి మండల స్థాయి రిటర్నింగ్ అధికారిని నియమించారు. క్లస్టర్ అధికారులుగా గెజిటెడ్ హోదా కలిగిన ప్రధానోపాధ్యాయులతో పాటు జిల్లా స్థాయి అధికారులను నియమించారు.


ఎన్నికల షెడ్యూల్ ఇదీ..

- ఈనెల 9న నోటిఫికేషన్ విడుదల
- అక్టోబరు 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- 12న నామినేషన్ల పరిశీలన
- నామినేషన్ల ఉపసంహరణకు 15 వరకు గడువు, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన
- అక్టోబరు 23న పోలింగ్
- నవంబరు 11న కౌంటింగ్

మొదటి విడతలోని మండలాలు..

జిల్లాలో బీర్‌పూర్, రాయికల్, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మేడిపల్లి మండలాల్లో 10 జడ్పీటీసీ స్థానాలకు 108 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన 554 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి విడతలో

మిగతా 8వ పేజీలో



నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో పాటు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ సజావుగా జారీ చేయాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 9న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని తెలిపారు. అక్టోబరు 9 నుంచి అక్టోబర్ 11 వరకు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అన్నారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పూర్తి స్థాయి బందోబస్తు కల్పించాలని అన్నారు.

నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 12న సాయంత్రం 5 గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటైన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలన్నారు. అభ్యర్థుల జాబితాపై అప్పీళ్ల కోసం 13 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందన్నారు. 14న అప్పీళ్లు పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 15 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుందన్నారు. అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలని అన్నారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాల జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో మదన్మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

జగిత్యాల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ క్యాంపు శివారులో గల ఈవీఎం గోదాంను బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలన జరిపారు. ప్రతీ నెల చేసే తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధికారి హకీం, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్

జగిత్యాలరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్ అన్నారు. సెర్ప్ కార్యకలాపాలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సెర్ప్ కార్యక్రమాల పనితీరును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సెర్ప్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజు, సీసీలు, గ్రామైఖ్యసంఘాల అధ్యక్షురాళ్లు, మహిళసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం రైతు కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయకుండా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. కనీసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే స్థితిలో ఈ ప్రభుత్వం లేదా అని ప్రశ్నించారు. ఆనాడు కేసీఆర్ సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించి చివరి గింజ వరకు కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్‌దే అని కొనియాడారు. అకాల వర్షాలకు తడిచిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలన్నారు. కార్యక్ర మంలో రాయికల్ పట్టణ, మండల అధ్యక్షులు ఎలిగేటి అనిల్, బర్కం మల్లేష్, కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సాయి కుమార్, మహేష్ గౌడ్, మహేందర్, మాజీ కో ఆప్షన్ సోహైల్, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, నాయకులు రాంచంద్రం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగుల మహాసభలను విజయవంతం చేయండి

జగిత్యాల అర్బన్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో ఈ నెల 24,25 తేదీల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఐదవ మహాసభలను విజవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అందులో 52 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని అన్నారు. వీరు పారిశుధ్యం, మంచి నీటి సరఫరా విధి లైట్లు, డంపింగ్‌యార్డు నిర్వహణతో పాటు పల్స్ పోలియో లాంటి ప్రభుత్వ కార్యక్రమాలలో పనులు చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు గాలికి వదిలి వేస్తున్నాయని అన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు, జీవో నంబర్ 51 సవరణ, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, న్యాతరి మల్లవ్వ, తిరుపతి, రాజు నాయక్, కొండమ్మ, పోచయ్య పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ

మల్యాల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎవరైనా గుండెపోటుకు గురైతే అత్యవసన పరిస్థితిలో ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ఉండేందుకు చేసే సీపీఆర్‌పై నూకపల్లి సూర్య బీఈడీ కళాశాల విద్యార్థులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది ట్రైనర్ లావణ్య శిక్షణ ఇచ్చారు. సీపీఆర్‌తో ప్రాణపాయం నుంచి కాపాడవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ గురించి తెలుసుకోవాలని ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సూచించారు. ఆసుపత్రి సిబ్బంది, కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆధారిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా విద్యాధికారి రాములు



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాములు

కోరుట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు కంప్యూటర్ ఆధారిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రాములు సూచించారు. బుధవారం పట్టణంలోని రత్నాధర బిఎడ్ కళాశాలలో కోరుట్ల, భీమారం, కథలాపూర్ మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులకు డిజిటల్ లిటరసీపై శిక్షణ తరగతులను జిల్లా విద్యాధికారి రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాములు ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలను అందించారు. డిజిటల్ లిటరసీపై శిక్షణను ప్రతి ఉన్నత పాఠశాలలో విధిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించి ప్రభుత్వ పాఠశాలలో పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిదాలన్నారు.


ఈ సందర్భంగా కోడంగ్ ఆర్టిపిసీ ఇంటలిజెన్స్, గణిత సబ్జెక్‌ను సందించినం కంప్యూటర్ అవగాహన రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులకు శిక్షణను అందించారు. జిల్లా సెక్టోరియన్ అధికారి రాజేష్, మండల విద్యాధికారులు మధు, ప్రదానోపాధ్యాయుడు గంగాధర్, సదాశివ, టెక్నికల్ ఇంచార్జ్ నాగరాజు, రిసోర్స్ పర్సన్స్ రాజగోపాల్, సంతోష్, శ్రీకాంత్, రాజగోపాల్ రెడ్డి, శ్రీనివాస్, సిఆర్‌పీలు గంగాధర్, మాన్విత, జ్యోతి వేవేందర్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత

పెగడపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత పేర్కొన్నారు. పెగడపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బుదవారం అదనపు కలెక్టర్ బిఎస్ లత ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తులు, సాదాబైనామా దరఖాస్తులు మండలంలో ఎన్ని వచ్చాయి, ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారంలో చేపట్టాల్సిన మార్గదర్శకాలు వివరిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్ కుమార్, గిర్దావర్‌లు శ్రీనివాస్, జమున, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్‌కు అల్లీపూర్ యువకుడి ఎంపిక



సుమన్

రాయికల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్‌కు మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన షార్ట్ ఫిలిం దర్శకుడు, నటుడు, నిర్మాత కూనమల్ల సుమన్ ఎంపికయ్యాడు. సుమన్ రూపొందించిన 'పుట్టింటి గౌరమ్మ' షార్ట్ ఫిలింను తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసింది. మూడు నిమిషాల నిడివిలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ షార్ట్ ఫిలింను రూపొందించారు. భవిష్యత్‌లో తెలం గాణ ఆత్మను ప్రతిబింబించే కథలతో అద్భుతమైన చిత్రాలను తీస్తానని సుమన్ పేర్కొన్నాడు.

అలంకారప్రాయంగా పల్లె దవాఖానాలు

- మూడేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం..
- పట్టించుకోని అధికారులు

తంగళ్లపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానల నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా నిలుస్తున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా 2022లో తంగళ్లపల్లి మండలంలో 7 పల్లె దవాఖానల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తంగళ్లపల్లి, నేరెళ్ల, లక్ష్మీపూర్, జిల్లెల్ల, తాడూరు, బస్వాపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో ఒక్కో పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.

● నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు..

తాడూరు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవాఖాన నిర్మాణాలు పూర్తిచేసుకుని మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకరప్రాయంగా నిలిచాయి. లక్ష్మీపూర్, జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానల నిర్మాణం పూర్తి చేసుకుని ఆందుబాటులోకి వచ్చాయి. నేరెళ్ల, ఒబులాపూర్ గ్రామాల్లో బేస్‌మెంట్ దశలోనే నిర్మాణ పనులు నిలిచిపో యాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించ డానికి ప్రయత్నించగా అందుబాటు లోకి రాలేదు.



తాడూరులో నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె దవాఖాన

● అద్దె ఇళ్లలోనే కొనసాగింపు..

మూడేళ్లుగా అద్దె ఇళ్లలోని ఇరుకు గదు ల్లో అరకొర వసతు లతో పల్లె దవాఖానాలు కొనసాగుతున్నాయి. మూడేళ్లుగా తాడురు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవఖానాలు నిర్మాణం పూర్తిచేసుకుని సిద్ధంగా ఉన్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో భవనాల నిర్మాణాల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో నిర్మాణం పూర్తయినా ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


తాడూరులో అద్దె ఇంట్లో పల్లె దవాఖాన

గత ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తి చేశాను..

- వెంకటరెడ్డి, కాంట్రాక్టర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం భవనం నిర్మాణం పూర్తిచేశాను. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మారాక పల్లె దవాఖాన నిర్మాణం బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాను. బిల్లులు త్వరగా చెల్లించి భవనం ప్రారంభించాలి. పల్లె దవాఖానల భవన నిర్మాణాల బిల్లులు చెల్లించేలా కలెక్టర్ చొరవ తీసుకుని పల్లె దవాఖానలు ప్రారంభించాలి.

పల్లె దవాఖానలు అందుబాటులోకి తేవాలి..

- తోట రాజు, తాడూరు



పల్లె దవాఖానలు త్వరగా అందుబాటులోకి తేవాలి. నిర్మాణం పూర్తి చేసుకుని మూడేళ్లు అవుతోంది. అధికారులను అడిగినా స్పందన లేదు. అద్దె ఇంట్లో ఇరుకు గదుల్లో పల్లె దవాఖాన కొనసాగుతోంది. నిర్మాణం పూర్తయినా ఎందుకు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలి.

వామన్‌రావు దంపతుల హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు-నాగమణి దంపతుల హత్యకేసు విచారణను సీబీఐ అధికారులు వేగవంతం చేస్తున్నారు. కేసు విచారణలో భాగంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా, మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణను, ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు బొల్లంపల్లి సంతోష్ గౌడ్‌ను రామగుండం కమిషరేట్‌లో ఉన్న సీబీఐ క్యాంపు ఆఫీసులో అధికారులు విచారించారు. ఈ ఇద్దరిని దాదాపు మూడు గంటల పాటు అధికారులు పలు అంశాలపై లోతుగా విచారించి వివరాలు సేకరించారు. వామన్‌రావుతో ఉన్న సంబంధాలపై ఆరాతీశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు సంబంధించిన రూ.9 వందల కోట్ల కేసు, ఇన్‌కంట్యాక్స్ కేసు తదితర అంశాలపై ఇనుముల సత్యనారాయణను అధికారులు ప్రశ్నించి వివరాలు సేకరించారు. మరికొందరిని సైతం సీబీఐ విచారించనున్నట్లు సమాచారం.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లోని సదాశివపల్లికి చెందిన సాయిని మహిపాల్ (34)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపల్లికి చెందిన మహిపాల్ అనే యువకుడికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం భార్యతో విడాకులు జరిగాయి. అప్పటి నుంచి ఒంటరిగా ఉండడమే కాకుండా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం

- అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై కనిపించిన పులి
- ఆనవాళ్లు వెతుకుతున్న ఫారెస్ట్ అధికారులు

గోదావరిఖని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలం బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో బసంత్ నగర్ నుంచి అంతర్గాం వైపు వెళ్లే బుగ్గ రోడ్డుపై పెద్దపులి దర్జాగా నడుస్తూ బాటసారుల కంటపడింది. కొందరు ఫొటోలు, వీడియోలు తీశారు. బసంత్‌నగర్ గుట్ట, బుగ్గ ప్రాం తంలో వర్షాకాలం నేపథ్యంలో దట్టంగా అడవి పెరిగింది. రాజీవ్‌రహదారికి ఇవతలి వైపు ఎన్‌టీపీసీ వాటర్‌డ్యామ్ వెనుకాల కూడా వందల ఎకరాల్లో దట్టమైన చెట్లు ఉండడంతో ఎక్కడి నుంచో పులి ఈ ప్రాంతానికి వచ్చినట్టు తెలుస్తున్నది. అయితే నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారి, రైల్వేట్రాక్‌తో పాటు పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతంలో పులి సంచారం అనేది చాలా ఏళ్ల తరువాత కనిపించింది. బసంత్‌నగర్ నుంచి అంతర్గాంకు రాత్రి పగలు లేకుండా కార్లపై, బైక్‌లపై, సైకిళ్లపై రాకపోకలు సా గుతాయి. కొందరు పాదచారులు కూడా నడుస్తారు. బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, లంబాడి తండ, కుంద నపల్లి గ్రామాలకు సంబంధించిన పశువులు, పశువుల కాపర్లు, ప్రజలు వంటచెరకు కోసం వెళ్లేవారు రాత్రి,పగలు ఆ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటారు. ఎన్‌టీపీసీ యాష్‌పాండ్ చుట్టూ ఉన్న ప్రాంతమంతా వర్షాకాల నేపథ్యంలో దట్టమైన చెట్లపొదలతో నిండిపోయింది. లంబాడి తండా పూర్తిగా అడవిని ఆనుకునే ఉంటుంది. అయితే ఈ విషయం తెలుసు కున్న ఫారెస్టు అధికారులు పులి పాదచారులకు కనిపించిన బుగ్గరోడ్డులో బుధవారం రాత్రి పరిశీలించారు. రాత్రి వేళల్లో పులికి సంబంధించిన పాద ముద్రలేవి ఫారెస్ట్ అధికారులకు కనిపించలేదు. కానీ ప్రయాణికులు పులి రోడ్డుపై వెళుతుండగా తీసిన ఫొటోలు బుగ్గ రహదారివేనని ధ్రువీకరించారు.


అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై పెద్దపులి

అపస్మారక స్థితిలో వృద్ధదంపతులు

- చికిత్స పొందుతూ భర్త మృతి, భార్య పరిస్థితి విషమం


అనుమానాస్పదంగా పడి ఉన్న గజ్జెల శంకరయ్య, లక్ష్మీ

గంగాధర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో అపస్మారక స్థితిలో ఇంటిలో పడిపోయిన వృద్ధదంపతులను చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జెల శంకరయ్య, లక్ష్మీ వృద్ధ దంపతులు. మంగళవారం రాత్రి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారని గ్రామస్థుల సమాచారంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు. శంకరయ్య పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మీ కోమాలోనే ఉండగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. శంకరయ్య మృతి పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పలు కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అయితే వీరికి సంతానం లేకపోవడం, గ్రామానికి చివరన ఇల్లు ఉంది. దీన్ని అవకాశంగా తీసుకున్న దుండగులు వారిపై మత్తు మందు చల్లి వృద్ధురాలి మెడలోని బంగారం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెగడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగాని అజయ్‌కుమార్(26) బీటెక్ ఫెయిల్ కావడంతో మద్యానికి బానిసగా మారి జల్సాలకు అలవాటుపడ్డాడు. వ్యవసాయ పెట్టుబడి కోసం తెప్పిం చిన అప్పు, జల్సాలకు చేసిన అప్పులు అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయిన అజయ్ గత శనివారం పొలం వద్ద గడ్డి మందుతాగి, కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెంటనే చికిత్సకోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందు తూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు అజయ్‌కుమార్ తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


అజయ్ (ఫైల్)

చలాన్లపై పోలీసు శాఖ సీరియస్

- ఫైన్ కట్టకుంటే వాహనం సీజ్ ● 45 రోజులు దాటితే అంతే ● ఏటా రూ.3.85 కోట్ల జరిమానా

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చలాన్లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించారని ప్రతిరోజు దాదాపు 500 వాహనాలకు ఈ-చాలన్ రూపంలో ఫైన్ వేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఏటా రూ.3.85 కోట్ల ఈ-చలాన్స్ ద్వారా ఫైన్ విధిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల పరిధిలో ప్రతిరోజు పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ప్రతి శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా హెల్మెట్, రాంగ్ పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సీట్ బెల్టు, అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర నిబంధనలు పాటించని వాహనాలకు ఈ-చాలన్ రూపంలో జరిమానాలు విధిస్తున్నారు. జరిమానా విధించి 45రోజులైనా చెల్లించకుంటే వాహనాన్ని పట్టేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఒక్కో వాహనానికి ఐదు జరిమానాలు ఉండి రోడ్డుపై తిరిగితే పోలీసులు వెంటనే పట్టేస్తున్నారు. పెండింగ్ చలాన్ల జరిమానాలు వెంటనే చెల్లించకుంటే వాహనాన్ని సీజ్ చేస్తున్నారు.



● రూ.11.55 కోట్ల జరిమానా..

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా మూడు సంవత్సరాల్లో వాహనదారులు దాదాపు రూ.11.55 కోట్ల ఈ-చలాన్ జరిమానాలు విధించారు. ఇందులో కేవలం రూ.3.58 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా రూ.7.97కోట్లు ఈ-చలాన్స్ జరిమానాలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన దాదాపు రూ.7.97కోట్ల వాహనాలకు ఈ-చలాన్స్ ద్వారా జరిమానాలు విధించగా, 25 శాతం వాహనదారులు మాత్రమే చెల్లించారు. మిగతా వాహన యజమానులు రూ.7.97 కోట్లు జరిమానాలు చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఐదు చలాన్లు ఉంటే వెంటనే చెల్లించకుంటే వాహనం సీజ్ చేయడమే కాకుండా వాహనం క్రయవిక్రయాలు చేయకుండా చర్యలు చేపట్టారు. మరోవైపు వాహనదారుడి లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తున్నారు.

● జరిమానా చెల్లించాల్సిందే

- మహేష్ బి. గీతే



జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన ప్రతి ఒక్కరూ జరిమానా చెల్లించాలి. ట్రాఫిక్ చలాన్స్ జరిమానాలు చెల్లించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించాలి.

ఏసీబీకి చిక్కిన ముగ్గురి రిమాండ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఒక ఆసుపత్రి నిర్వాహకుడి వద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో కరీంనగర్ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ రెడ్డి, ప్రైవేట్ సహాయకుడు రాములను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు నిందితులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసులు అరెస్టు చేసిన డ్రగ్ కంట్రోల్ అధికారులు శ్రీనివాసులు, కార్తీక్ భరద్వాజ్‌రెడ్డి వద్ద బ్యాగ్‌లలో తనిఖీ చేయగా రూ.లక్షా 73 వేల నగదు పట్టుబడింది.

హైదరాబాద్, వరంగల్‌లోని ఈ ఇద్దరు అధికారుల ఇళ్లలో ఏసీబీ పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. బ్యాంక్ పాస్‌బుక్‌లు, లాకర్‌లు, ఇతర ఆస్తుల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బ్యాంక్ ఖాతాలు, లాకర్‌లను ఫ్రీజ్ చేసినట్లు, ఈ ఇద్దరు అధికారుల అవినీతిపై రెండు నెలల నుంచి ఏసీబీకి చాలా ఫిర్యాదులు అందినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్, నరేష్‌లు సోమవారం ద్విచక్ర వాహనంపై మండలంలోని లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గయ్యపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో పై ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు.


రాకేష్ (ఫైల్)

శాంతినగర్‌లో కార్డన్ సెర్చ్

- ధ్రువీకరణ పత్రాలు లేని 105 వాహనాలు సీజ్



శాంతినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, వినాయకనగర్‌లో బుధవారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 77 ద్విచక్రవాహనాలు, 27 ఆటోలు, ఒక ట్రక్‌ను సీజ్ చేశారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్పరిణామాలపై వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, సంజీవ్, సదన్ కుమార్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకుపోతుండగా బుధవారం స్థానికులు గుర్తించారు. మృతదేహం గుర్తు పట్టకుండా ఉన్నది. మృతదేహాన్ని ఎవరూ బయటకు తీయకపోవడంతో కాలువలోనే కొట్టుకుపోయింది. ఘటన వివరాలు తెలియాల్సి ఉన్నది.

మహిళా పోలీసులతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఇల్లందకుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో మహిళా పోలీసులచే బుధవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సేఫ్ హ్యాండ్స్ విత్ తెలంగాణ పోలీస్-నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్, లా అండ్ ఆర్డర్ విధుల్లో భాగంగా బ్లూకోల్ట్ విధులు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

వరికి దోమ కాటుతో రైతు విలవిల

- సన్న రకం వరికి దోమకాటు, కాటుక తెగులు ● డ్రోన్‌లతో పురుగు మందు పిచికారి ● రైతులకు పెరుగుతున్న ఖర్చులు

సైదాపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరి గొలుసు పూర్తిగా బయటకు వచ్చి గింజలు అయ్యే సమయంలో దోమకాటు, కాటుక తెగులు(నల్లి పురుగు) సోకుతోంది. దీంతో వరి నలుచుగా మారడం, గింజలు నల్లబడి తాలుగా మారుడం జరుగుతుంది. వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో నేల ఎండకుండా ఎప్పటికి తేమగా ఉండడంతో వరిలో దోమ, కాటుక తెగులు సోకుతుంది. ఎక్కువగా ఈ దోమ కాటు, కాటుక తెగులు సన్నరకం వరికే ఆశిస్తుంది. రైతులు సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తున్నదని చాలా మంది రైతులు సన్నరకం వరిపంటను సాగు చేశారు. ఈ సన్నరకం వరి మొదటి నుంచి పురుగు మందులు పిచికారి చేస్తేనే పంట దిగుబడి వస్తుంది. మొదట పొట్ట దశకు రాకముందు ఘనే పురుగుకు ఆశించకుండా పురుగుమందులు పిచికారి చేశారు. ఇప్పుడు దోమ కాటుతో పాటు, నల్లి పురుగు ఆశిస్తున్నదని రైతులు వాపోతున్నారు. పురుగు మందుల పిచికారితో పెట్టుబడి పెరిగిపోతున్నదని రైతులు తెలుపుతున్నారు. రైతులు డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. డ్రోన్లతో పురుగు మందుల పిచికారికి ఎకరాకు రూ. 500లు తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, పొలాలు ఆరడం లేదని, పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలంలో సమారు 19వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. అందులో సుమారు 8వేల ఎకరాల సన్న రకం, సుమారు 11వేల ఎకరాల దొడ్డు రకం వరి సాగు చేశారు. దొడ్డు రకాలకు తక్కువగా చీడ పీడలు ఆశిస్తున్నాయి. సన్నరకం వరికి ఎక్కువగా చీడపీడలు ఆశిస్తున్నాయని రైతులు తెలపుతున్నారు. పంట చేతికి వచ్చేవరకు నమ్మకం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.


జాగీర్‌పల్లిలో దోమ కాటుకు గురైన వరి


డ్రోన్‌తో పురుగు మందు పిచికారి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వైదేహి, సైదాపూర్ వ్యవసాయాధికారి



వానాకాలం సీజన్‌లో గింజ గట్టిపడే దశలో వరికి వచ్చే సుడి దోమ, కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి. గింజ గట్టిపడే దశలో కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు టెబ్యుకొనజోల్ , ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 200మి.లీ ఎకరానికి పిచ్చికారి చేయాలి. సుడిదోమ రాకుండా ఉండేందుకు రైతులు పొలాన్ని ఆరబెట్టాలి. డైనోటెఫ్యూరాన్ 80గ్రా, లేదా పైమెట్రోజైన్ 120గ్రా మొక్కలు మొదళ్ల తడిచేలా చూడాలి.

వీధి కుక్కల పట్టివేత

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో కొన్ని నెలల నుంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కుక్కలను మున్సిపాలిటీ వారు పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. వీటికి శాశ్వత పరిష్కారంగా చర్యలు చేపట్టాలని, వాటికి కూడా ప్రభుత్వభూమిలో షెడ్డులు ఏర్పాటు చేసి, జీవించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు కోరుతున్నారు.


వీధి కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

ఆర్టీసీ బస్సు కోసం ఆదర్శ పాఠశాల విద్యార్థుల అవస్థలు

● ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతున్న తల్లిదండ్రులు



పోచంపల్లిలో ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి పోచంపల్లిలో ఆదర్శ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులు తమతమ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు మీదికి వచ్చి గంటల తరబడి వేచి చూస్తుంటారు. జమ్మికుంట నుంచి కరీంనగర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు అక్కడి నుంచి ప్రయాణికులతో రద్దీగా వస్తుండడంతో ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో విద్యార్థులు గంటల తరబడి రోడ్డుపై బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇళ్లలోకి చేరుకొనే సరికి రాత్రి ఏడు గంటల నుంచి 8గంటల సమయం పడుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెంజర్లకు చెందిన ఇద్దరు విద్యార్థులు బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ బస్సు టైరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. సమస్యపై కలెక్టర్‌తో పాటు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించినా సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థుల తల్లిందండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదర్శ పాఠశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం



- 'ఎన్‌ఎంఎంఎస్' ద్వారా ఏడాదికి రూ.12వేలు మంజూరు
- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- 9 నుంచి ఇంటర్ వరకు అందనున్న కేంద్ర సాయం
- ఈనెల 14 వరకు దరఖాస్తుకు గడువు
- నవంబరు 23న ప్రతిభ పరీక్ష

వెల్గటూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రభుత్వం 2008లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జాతీయ ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు కేంద్ర ప్రభుత్వం అందించనున్నది. ఈ నగదు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. పదో తరగతి తరువాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఉపకార వేతనం కోసం వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా గత ఏడాది జగిత్యాల జిల్లా నుంచి ఎన్‌ఎంఎంఎస్‌కు 72 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఏడాదిలో సంఖ్యను పెంచేందుకు నవంబర్‌లో జరగనున్న పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందు కోసం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల చదువులు మధ్యలో ఆపేయకుండా జాతీయ ఉపకార వేతనాలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

● అర్హతలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువు తున్న విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మార్కులు సడలింపు ఉంటుంది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించి ఉండకూడదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫాంతో పాటు 7వతరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, స్టడీ, ఆదాయ, కుల ధ్రువీకరణ జిరాక్స్ ప్రతులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

● పరీక్ష విధానం

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో మానసిక సామర్థ్య పరీక్షకు సంబంధించి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. రెండవ విభాగంలో 7,8 తరగతులు సిలబస్ నుంచి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. దీనిలో గణితం నుంచి 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవశాస్త్రం నుండి 35 మార్కులు, సాంఘికశాస్త్రం నుండి 35 మార్కులు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి
-ప్రభాకర్, వెల్గటూర్ ఎంఈవో



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నాలుగేళ్ల పాటు అందించనున్న ఉపకార వేతనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందనున్నాయి. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుంది. విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్ష రాసేందుకు సన్నద్ధమవ్వాలి.

ఆర్టీసీకి దసరా బొనాంజా

● కరీంనగర్ రీజియన్‌కు రూ.4.8 కోట్ల ఆదాయం ● 1,680 స్పెషల్ బస్సులతో ప్రయాణికులకు సేవలు



భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు ఆర్టీసీకి లాభాలను తెచ్చిపెట్టాయి. పండుగల సందర్భంగా ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడిపించింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో రెగ్యులర్ సర్వీసులతోపాటు 1,680 స్పెషల్ బస్సులతో గత నెల 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ప్రయాణికులకు సేవలందించింది. కరీంనగర్ రీజియన్‌లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిళల నుంచి 2,75,75,749 రూపాయల ఆదాయం సమకూరినట్లు రీజినల్ మేనేజర్ ప్రకటించారు. స్పెషల్ బస్సుల ద్వారా మహాలక్ష్మి పథకంతో కలిపి 4,80,01,642 రూపాయల ఆదాయం సమకూరింది. మొత్తం 10 రోజుల్లో మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణికులతో కలిపి 4,63,119 మంది వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. గోదావరిఖని డిపో 260 స్పెషల్ బస్సులను నడిపించగా 73,78,376 రూపాయల ఆదాయం వచ్చింది. హుస్నాబాద్ నుంచి 100 బస్సులను నడిపించగా 28,37,837, హుజురాబాద్ డిపోకు చెందిన 110 బస్సులకు 31,21,621, కరీంనగర్-1 డిపో నుంచి 170 బస్సులను నడిపించగా 48,24,323 రూపాయల ఆదాయం వచ్చింది. కరీంనగర్-2 డిపో 270 బస్సులకు 76,62,160, మంథని డిపో నుంచి 120 బస్సులకు 35,87,338, జగిత్యాల డిపో 140 బస్సులకు 40,73,725, కోరుట్ల డిపో 120 బస్సుల ద్వారా 34,05,404 రూపాయల ఆదాయం వచ్చింది. మెట్‌పల్లి డిపోకు చెందిన 140 బస్సుల ద్వారా 39,72,972, సిరిసిల్ల డిపోకు 130 బస్సుల ద్వారా 36,89,188, వేములవాడ డిపోకు 120 బస్సుల ద్వారా 34,48,698 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. 16 గేట్లు పైకి ఎత్తి 49,984 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 59,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 59,774 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు బుధవారం 2200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద కాలువ ఇన్‌లెట్స్‌తో పాటు ములవాగు ద్వారా2200 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దిగువకు ఒక గేట్ ద్వారా 1500 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు . ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 27.145 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సీసీ టీవి ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ప్రారంభం కానున్న శిక్షణ 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల 18 నుంచి 45 సంవత్సరలలోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్. 9502593347, 9849411002 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కె సౌమ్య, పి కాశీవిశ్వనాథ్ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి విద్యార్థులను, పీడీని అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 55మంది రైతులు 392క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ చిరునామా

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



లక్కీడ్రాలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) చిరునామాగా నిలుస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో దసరా స్పెషల్ లక్కీ డ్రా విజేతలకు బహుమతులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారన్నారు. డిప్యూటీ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, కరీంనగర్ ఒకటి, రెండో డిపో మేనేజర్లు ఐ. విజయ మాధురి, ఎం.శ్రీనివాస్, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.మల్లేశం, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలు

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల బస్సుల్లో ప్రయాణించిన వారిల్లో మొదటి బహుమతి రూ.25,000ను ఈ.రమేశ్ (కరీంనగర్), రెండో బహుమతి రూ.15,000 వి.సదానందం (గోదావరి ఖని), మూడో బహుమతి రూ.10,000 కె.నాగరాజు (జగిత్యాల) దక్కించుకున్నారు.

ముగిసిన రీజినల్ ఫారెస్టు క్రీడలు

- పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా సిద్దిపేట జోన్



పోటీల విజేతలకు పతకాల ప్రదానం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బుధవారం రాత్రి ముగిశాయి. అన్ని క్రీడల్లో అధిక పాయింట్లు సాధించిన సిద్దిపేట జిల్లా జోన్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో రాజన్న జోన్‌లోని కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, రాజన్న సిరిసిల్ల నుంచి 400 క్రీడాకారులు హాజర య్యారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టగ్గాఫ్ వార్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు సమావేశంలో కరీంనగర్ డీఎఫ్‌వో బాలమణి, కామారెడ్డి డీఎఫ్‌వో బోగాని నిఖిత, మెదక్ డీఎఫ్‌వో జోజి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల డీఎఫ్‌వోలు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతను కలిగించాయన్నారు. పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులు వచ్చేనెలలో జరుగనున్న రాష్ట్రస్థాయి అటవీశాఖ ఉద్యోగుల క్రీడలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఒకరి మృతి



ప్రమాదస్థలంలో హార్వెస్టర్

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ హార్వెస్టర్ కరీంనగర్ వైపు నుంచి హైదారాబాద్ వైపునకు వెళుతుండగా వెనుక నుంచి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్‌పై ఉన్న హెల్పర్ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల సాగర్ (28) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్ పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన గుండ్రాతి సంతోష్ గాయపడ్డాడు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఆస్పత్రికి తరలించిన పోలీసులు

వేములవాడ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. సాయినగర్‌లోని ఓ ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటన తెలుసుకున్న నైట్ పెట్రోలింగ్ పోలీసులు గాయాలతో కింద పడిన వ్యక్తిని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పుష్పయాగం.. ఏకాంత సేవ



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు



ఏకాంత సేవలో స్వామివారు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను దేవాదాయ - ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం పట్టణ పురవీధుల గుండా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చాడు. రాత్రి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణాధికారి మారుతిరావు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి



ఉద్యోగులను అభినందిస్తున్న ఈఎన్సీ మధుసుదన్‌రావు

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరి సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని కరీంనగర్ ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయ సమావేశ మందిరంలోటీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇరిగేషన్ శాఖ మహిళాలకు జిల్లా స్థాయిలో బహుమతులు రావడంతో వారికి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈఎన్‌సీ మధుసూదన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు తీరుతున్నాయని, పర్మినెంట్ ప్రమోషన్లు వస్తున్నాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారన్నారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. బతుకమ్మ వేడుకల్లో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన మహిళా ఉద్యోగులను మదుసూదన్‌రావు అభినందించారు. తెలంగాణ వచ్చిన తరువాత బతుకమ్మ పండగ పల్లెటూళ్ల నుంచి పట్నాలకు అక్కడి నుంచి దేశ విదేశాలకు పాకిందని అన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ రాష్ట్రానికి గుండెకాయలాంటిందని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులను ప్రభుత్వం ఇవ్వలేకపోవడం చాలా బాధకారం అన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఈఎన్‌సి సురేందర్‌రెడ్డి, ఎస్‌ఈలు సుమతి దేవి, శ్రీనివాస్ గుప్త, ఈఈ జగన్, జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి శ్రీనివాస్, హర్మిందర్ సింగ్, గూడ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మన్నె సరిత, జిల్లా నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలి

● దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సుప్రియ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు, వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలని సహాయ కమిషనర్ నాయిని సుప్రియ అన్నారు. బుధవారం ఏసీ కార్యాలయంలో ఈఓలు, మేనేజర్లు, ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆలయాల నుంచి శాఖకు బకాయిలు చెల్లించాలని, ఆడిట్ లెక్కలు పూర్తి చేయాలని అన్నారు. ఆలయ భూముల రిజిస్ట్రేషన్ చేసి జీపీఎస్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. నూతనంగా రిజిస్ట్రేషన్ అయిన దేవాలయాల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. కొత్త ఈవోలు పాత ఈవోల నుంచి బంగారు, వెండి ఆభరణాలను, వాటి లెక్కలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆలయాలకు సంబంధించి కోర్టులో కేసులుంటే కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టెర్లు నెలవారి ఆలయాల సందర్శన రిపోర్ట్‌ను సమర్పించాలని, ఏసీ కార్యాలయంలో ఆయా ఆలయాలకు చెందిన ఏమైనా పెండింగ్ పనులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

కోరుట్ల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీల నామినేషన్ల స్వీకరణకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ బుధవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సమావేశ మందిరంలో కౌంటర్1లో జడ్పీటీసీ నామినేషన్‌ను స్వీకరిస్తారని వివిధ గ్రామాల క్లస్టర్ పరిధిలో ఎంపీటీసీ నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కౌంటర్-2 వద్ద క్లస్టర్1 పరిధిలోని మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, వెంకటాపూర్, కౌంటర్3లో క్లస్టర్ 2 పరిధిలోని అయిలాపూర్1, అయిలాపూర్ 2, యూసుఫ్ నగర్, కౌంటర్4లో క్లస్టర్ 3 పరిధిలోని పైడిమడుగు, మాదాపూర్, జోగినిపల్లి, కౌంటర్5లో క్లస్టర్ 4 పరిధిలోని నాగులపేట, ధర్మారం, కల్లూర్ గ్రామాల ఎంపీటీసీ పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి ఏర్పాట్లును అధికారులు చేస్తున్నారు.


మెట్‌పల్లి మండలంలో..

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 8: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు బుధవారం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నామినేషన్ల స్వీకరణకు మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

బీర్‌పూర్ మండలంలో..

బీర్‌పూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో భీమేష్ తెలిపారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారుల వద్ద మాత్రమే తీసుకొని నామినేషన్ వేయాలన్నారు.

మందకొడిగా టెండర్లు



- మద్యం షాపుల దరఖాస్తు ఫీజు పెంపుతో వ్యాపారుల డైలమా
- 13 రోజుల్లో 24 దరఖాస్తులే రాక
- ఈనెల 18 వరకు గడువు

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ఖరారు చేసిన నేపథ్యంలో వ్యాపారులు టెండర్ వేయాలా.. వద్దా.. అనే డైలామాలో పడిపోయారు. దరఖాస్తు ఫీజు భారీగా పెంచడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. 2023-24 సంవత్సరానికి గాను టెండర్లు వేసిన చాలా మంది నష్టాలు చవిచూశారు. గతంలో రూ.2లక్షలుగా ఉన్న దరఖాస్తు ఫీజును ప్రభుత్వం రూ.3 లక్షలకు పెంచింది. దీంతో పలువురు వ్యాపారులు ముందుకు వెళ్లాలా.. వద్దా అనే ఆలోచనలో పడ్డారు. 2023 ఆగస్టులో నిర్వహించిన టెండర్లలో రెగ్యులర్ వ్యాపారులే కాకుండా సాధారణ ప్రజలు సైతం పాల్గొన్నారు.

అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2023 సంవత్సరంలో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. 2,636 మంది టెండర్లు వేశారు. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది డిసెంబరుతో గడువు ముగుస్తుండగా ప్రభుత్వం మూడు నెలల ముందే టెండర్లు ఆహ్వానించింది. గత నెల 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 18వ తేదీతో టెండర్ల గడువు ముగియనుంది. ప్రక్రియ ప్రారంభమై 13 రోజులు గడిచినా ఇప్పటి వరకు కేవలం 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

వేచి చూసే ధోరణిలో..

గత యేడాది అత్యధిక అమ్మకాలు జరిపిన బెల్టు షాపులను గుర్తించి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. రెండేళ్లతో పోలిస్తే అమ్మకాలు గణనీయంగా పెరిగినప్పటికీ షాపుల సంఖ్య పెంచలేదు. లక్కీ డ్రా పద్ధతిన దుకాణాలు ఎంపిక చేయనున్న నేపథ్యంలో ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జగిత్యాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 9, ధర్మపురి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 10, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఐదు దరఖాస్తులు వచినట్లు అధికారులు ప్రకటించారు.

జిల్లాలో 71 మద్యం దుకాణాలు..

జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. జగిత్యాల సర్కిల్ పరిధిలో 28 దుకాణాలు, ధర్మపురి సర్కిల్ పరిధిలో 18, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో 25 దుకాణాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 71 వైన్స్ షాపులకుగాను గౌడ కులస్తులకు 14 దుకాణాలు, ఎస్సీ సామాజిక వర్గానికి 8 దుకాణాలను, 49 దుకాణాలను జనరల్‌కు కేటాయించారు. 2019 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 64 దుకాణాలకు టెండర్లు నిర్వహించగా 1,285 దరఖాస్తులు రాగా, ఎక్సైజ్ శాఖకు రూ.25.70 కోట్ల ఆదాయం లభించింది. 2023 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 71 దుకాణాలకు టెండర్లు నిర్వహించగా 2,636 దరఖాస్తులు రాగా, ఎక్సయిజ్ శాఖకు రూ. 52 కోట్ల ఆదాయం లభించింది. జిల్లాలో సగటున నెలకు రూ.62 కోట్ల విలువ గల లిక్కర్ క్రయ విక్రయాల టర్నోవర్ ఉంటోంది. యేడాదికి సుమారు రూ.751 కోట్ల లిక్కర్ అమ్మకాల టర్నోవర్ ఉంటుందన్న అంచనాలున్నాయి. గత యేడాది కొందరు వ్యాపారులకు నష్టాలు రావడంతో వేచి చూసే ధోరణిలో ఉన్నారు.

సిండికేట్‌కే మొగ్గు..

పలువురు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసేందుకే మొగ్గు చూపుతున్నారు. గతంలో చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబసభ్యుల పేరిట టెండర్లు వేశారు. మహిళలు సైతం చాలా మంది పాల్గొన్నారు. జిల్లాలో 15 నుంచి 20 దుకాణాల్లో అమ్మకాలు భారీగా ఉండడంతో వాటికి పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పలుకుబడి ఉన్న కొందరు వారు ఎంచుకున్న షాపులకు ఇతరులు పోటీ రాకుండా ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

2023 సంవత్సరంలో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి కేంద్రాలుగా ఎక్కువ సిండికేట్లు ఏర్పడ్డాయి. ఒక్కో గ్రూపులో 100 మంది నుంచి 1000మంది సభ్యులు ఉండడం గమనార్హం. వీరు మూడు నుంచి ఐదు జిల్లాల పరిధిలోని దుకాణాలకు టెండర్లు వేశారు. టెండర్ డబ్బు నష్టపోకుండా ఉండేందుకు ఇలా వ్యవహరించినట్లు తెలిసింది. ఏ ఒక్కరికి దుకాణం వచ్చినా సభ్యులందరూ భాగస్వాములు కావచ్చనే ఉద్దేశంతో ఇలా వ్యవహరించారు. ప్రస్తుతం జరుగుతున్న టెండర్లలోనూ చక్రం తిప్పడానికి సదరు సిండికేట్ వ్యాపారులు వ్యూహం రచిస్తున్నారని ఎక్సైజ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నేడు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్..?

(ఐదో పేజీ తరువాయి)

మొత్తం ఓటర్లు 2,97,763 ఉన్నారు. ఇందులో పురుషులు 1,39,874 మంది, స్త్రీలు 1,57,788 మంది, ఇతరులు 1 ఉన్నారు. సుమారు రెండు వేల మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

● స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లు..

జిల్లాలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో జగిత్యాల, జగిత్యాల రూరల్, కొడిమ్యాల, మల్యాల, ధర్మపురి, బుగ్గారం మండలాలకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయగా, జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో రాయికల్, సారంగపూర్, బీర్‌పూర్ మండలాలకు అదేవిదంగా ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్‌లో మల్లాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలకు, గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూరు, ఎండపల్లి మండలాలకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● పకడ్బందీగా ప్రవర్తన నియమావళి అమలు..

రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడం, తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుండడంతో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలులోకి తీసుకొని రానున్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో 40 ప్రత్యేక అధికార బృందాలు విధులు నిర్వహిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పరిచారు. ఎన్నికల కోడ్‌కు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా పరిష్కరించడానికి అధికారం యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

ధాన్యం నిల్వల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఏవో హకీంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారాబాయిల్డ్, రా రైస్ మిల్లుల్లో సీఎంఆర్‌కు చెందిన ధాన్యం నిల్వల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ సత్యప్రసాద్‌కు బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకుల రంజిత్‌తో పాటు పలువురు నేతలు వినతి చేశారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి సమస్యను విన్నవించిన అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవో హకీంకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు సమస్యను విన్నవించారు. మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం నిల్వల్లో సివిల్ సప్లయి శాఖ రికార్డులకు వాస్తవ నిల్వలకు వ్యత్యాసాలు ఉంటున్నాయని ఆరోపించారు. గత రెండు సీజన్‌లుగా సీఎంఆర్ బియ్యం, టెండర్ ధాన్యం అప్పగించని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2025-26 వానాకాలం సీజన్‌కు గానూ దిగుబడి కానున్న ధాన్యాన్ని బకాయి సీఎంఆర్ కలిగిన మిల్లర్లకు కేటాయింపులు జరపవద్దని విన్నవించారు. 2022-23 యాసంగి, 2024-25 వానాకాలం, 2024-25 యాసంగి సీజన్‌లలో లక్ష్యం మేరకు సీఎంఆర్ అప్పగించని మిల్లర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కేటాయింపుల్లో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కోరుట్ల మండలానికి చెందిన పలువురు బీజేపీ ఓబీసీమోర్చ నాయకులు పాల్గొన్నారు.

‘పేదలకు స్వచ్ఛంద సంస్థ వైద్య సేవలు అభినందనీయం’



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు సిద్దిపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని కొండపాక గ్రామంలో ఉన్న సత్యసాయి సంజీవని ఆసుపత్రి సేవలు అభినందనీయమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని మాతా శిశు కేంద్రంలో సత్యసాయి వెల్ నెస్ సెంటర్ ఆధ్వర్యంలో పుట్టుకతో వచ్చు హృదయ సంబంధ వ్యాధుల నిర్ధారణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుండె ఆపరేషన్‌లు చాలా ఖర్చుతో కూడుకున్నవని, పేద ప్రజలకు ఆపరేషన్ చేయించుకునే స్థోమత ఉండదని అన్నారు.

జగిత్యాల పట్టణానికి చెందిన సాయి వెల్ నెస్ సెంటర్ వారు ఉచితంగా గుండె వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. కొండపాకలో పూర్తిగా ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమయిన వారికి ఉచితంగా ఆపరేషన్‌లు కూడా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో కండపాక ఆసుపత్రి నిర్వహణ ప్రతినిధి శర్మ, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సత్య సాయి సేవా సమితి సభ్యులు కోటగిరి శ్రీనివాస్, పాల్తెపు భూమేశ్వర్ పాల్గొన్నారు.

71 మందికి పరీక్షలు

సిద్దిపేట జిల్లా కేంద్రం సమీపంలోని కొండపాక గ్రామంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జగిత్యాల మాతా శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె పరీక్ష శిబిరంలో 71 మందికి పరీక్షలు నిర్వహించినట్లు కొండపాక ఆసుపత్రి నిర్వాహకులు శర్మ, సత్యసాయి సేవా సమితి సభ్యులు కోటగిరి శ్రీనివాస్‌లు తెలిపారు. ఇందులో 18 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారని వారికి త్వరలో కొండపాక ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న వారు కొండపాక ఆసుపత్రికి వస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తామని, అవసరమైన వారికి ఆపరేషన్‌లు ఉచితంగా చేయిస్తామని వారు తెలిపారు.

కార్యవర్గం

కోరుట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోరుట్ల యూనిట్ నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎంపిక బుధవారం జరిగింది. అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడుగా ఎస్ ప్రకాష్, కార్యదర్శిగా సుదాకర్, కోశాధికారిగా మురళి, అసోసియేట్ అధ్యక్షుడుగా నర్సయ్య, ఉపాధ్యక్షులుగా భూపతి, శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముస్తాక్ హుస్సెన్, సహాయ కార్యదర్శిగా గంగారావు, ప్రచార కార్యదర్శిగా సత్యనారాయణ, జిల్లా కైన్సిల్ సభ్యులుగా శ్రీనివాస్, శంకర్, కిషన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

కోరుట్ల పోలీసులకు ఎస్పీ అభినందన

కోరుట్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక, దసర వేడుకలు సమర్థమతంగా నిర్వహించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించిన కోరుట్ల పోలీసులను బుధవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి ప్రశంసా పత్రాలను అందించాడు. కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కానిస్టేబుల్ గంగాధర్‌లను ఎస్పీ అభినందించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

-ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిపై ప్రతి పోలీసు అధికారికి అవగాహన ఉండాని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. బుధవారం జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పటిష్టమైన ప్రణాళికతో నిర్వహించాలని ఆయన సిబ్బంది తెలిపారు. జిల్లా లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎటువంటి సమస్యలు లేకుండా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించాలని సూచించారు. అనంతరం ఎన్నికల నియమావళిపై అదనపు కలెక్టర్ రాజాగౌడ్ పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు.

ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

-మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారుల ప్రాత కీలకమైనదని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశం కార్యాలయంలో మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలలాకు చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్, జోనల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు రిటర్నింగ్ అధికారుల బాధ్యత చాలా ముఖ్యమైనదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల కమిషన్ సంబంధించిన నిబంధనలను క్షుణంగా పరిశీలించి అవగాహన చేసుకోవాలన్నారు. నామినేషన్నల ప్రక్రియ నుంచి కౌంటింగ్ వరకు ఎలాంటి తప్పులు లేకుండా సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మహేశ్వర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



పొలం బాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

కోరుట్ల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ట్రాన్స్‌కో కమర్షల్ ఏడీఈ వెంకటేశ్వర్లు అన్నారు. రైతులతో పాటు ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బుధవారం మండలంలోని యుసుఫ్‌నగర్ గ్రామంలో రైతులతో కలిసి పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ97 నాణ్యమైన విద్యుత్ అందిస్తూ రైతు ప్రయోజనాలక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రూరల్ శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

11న ధర్మపురి క్షేత్రానికి చాగంటి కోటేశ్వర్‌రావు రాక

ధర్మపురి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రానికి ఈనెల 11, 12 వ తేదీల్లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు రానున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రెండు నెలల క్రితం స్వయంగా ఆయన వద్దకు వెళ్లి ఆహ్వానించడం వల్ల క్షేత్రానికి రానున్నట్లు చాగంటి అంగీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. 11, 12వ తేదీల్లో క్షేత్రానికి వచ్చి ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ ప్రవచన కార్యక్రమాలు ప్రతి నిత్యం 6 గంటల నుండి రాత్రి 8 వరకు బ్రాహ్మణ సంఘం పక్కనే గల ధర్మపురి శ్రీ మఠం పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి స్వామి స్థలంలో ఉంటాయని ఆయన తెలిపారు. పీఠాధిపతి అనుమతితో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దేవస్థానం ధర్మకర్తల మండలి, ఇతర ప్రముఖుల సూచనలతో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

-హామీల అమలులో కాంగ్రెస్ విఫలం -కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డును చూపుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)8: బీఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఇంటింటికి వివరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ కార్డ్‌ను మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డితో పాటు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థునలు గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలలో ఒక్కటీ అమలు చేయని కాంగ్రెస్ పార్టీని నిలదీయాలన్నారు. రైతులు, మహిళలు, యువత, వృద్ధులతో పాటు ప్రతి వర్గానికి బాకీ పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుతో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంచుతూ ప్రజలకు మోసాన్ని తెలయజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పేద కుంటుంబాలకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీలను అందజేశారు. కోరుట్ల నియోజవర్గ పరిధిలోని ఐదుగురికి రూ.6,60,000 విలువ గల ఐదు ఎల్‌వోసీ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

15న లక్ష్మీనరసింహ స్వామి హుండీ లెక్కింపు

ధర్మపురి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు ఈ నెల 15న ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, భక్తులు, అర్చకులు, సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు. సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ఇబ్రహీంపట్నం,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి):మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు బుధవారం శ్రమదానం చేసి రోడ్డును బాగు చేసునుకున్నారు. గ్రామంలోని ముదిరాజ్ సంఘ భవనం నుంచి గ్రామ శివారులో గల పెద్దగుట్ట వద్ద గల దుర్గమ్మ దేవాలయం వరకు ఒక కిలోమీటర్ మేర ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న మట్టి రోడ్డు పైన గల గుంతలను పూడ్చివేసి, రోడ్డుకి ఇరువైపులా గల పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో రాజనర్సయ్య, రాజయ్య, ఐలయ్య, ముత్యాలు, నర్సింలు, రాజమౌళి, అరుణ్, నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకోం

చందుర్తి అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేము లవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా రాజన్న ఆలయాన్ని మూసివేస్తే ఊరుకునేది లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ అన్నా రు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేసే పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. బీజేపీ ఎప్పుడూ ఆలయాల అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పోశెట్టి రాకేష్, నాయకులు మోత్కు పల్లి రాజశేఖర్, చిలుముల హన్మయ్య చారి, బంధం తిరుమల్‌రెడ్డి, కొక్కుల నరేష్ ఉన్నారు.

పొన్నం వ్యాఖ్యలు హాస్యాస్పదం

-బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం

పెగడపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) :

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ తదనంతరం ఇది బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర అంటూ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు. బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలసి సత్యం విలేకరులతో మాట్లాడుతూ అణగారిన వర్గాలను దళితులను ప్రజలను అవమానపరిచే విధంగా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే చెల్లుతుందని అన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, గట్టయ్య, రాము, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 కేజీల బియ్యం, చీరలు, పుస్తకాలు, పెన్నులు, గొడుగులు, మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాసరావు ,సెక్రటరీ జైపాల్ రెడ్డి ,ట్రెజరర్ వేములవాడ చంద్రశేఖర్, ఇల్లెందుల శ్రీనివాస్, ప్రోహర్ తుకారాం, మర్రి భాస్కర్, జోగ జగదీశ్వర్, కలిగేటి మల్లేష్ సభ్యులు పాల్గొన్నారు

రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించాలి

-కలెక్టర్ సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వీలైనంత తొందరగా పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత సర్వే నంబర్‌ల మీద క్షేత్ర స్థాయిలో మరియు రికార్డు పరంగా విచారణ చేసి సరి చేయాలని, సాదా బైనమా కేసులను పరిష్కరించాలని, అసైన్మెంట్ కేసుల్లో ఎంక్వైరీ పూర్తి చేయాలని, కోర్టు కేసుల్లో ఉన్న భూముల విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. భూసేకరణ విషయంలో తొందరగా అవార్డు చేయాలని, ఫారెస్ట్, రెవెన్యూ వివాదాలు జాయింట్ సర్వే చేసి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ, అసైన్డ్, ఇరిగేషన్, భూదాన్, వక్ఫ్, ఎండోమెంట్, శిఖం భూములకు జీఐఎస్ బేస్డ్ సర్వే మ్యాప్ తయారు చేసి సంబంధిత సైట్ లో అప్లోడ్ చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి, జగిత్యాల, కోరుట్ల మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.